

30 వరకూ జాయింట్ పట్టాదారులకు వెసులుబాటు

ప్రజాశక్తి - రామచంద్రపురం

జాయింట్ పట్టాదారుల భూములకు విభజన చేసుకునేది ఈ నెల 30 వరకు ప్రభుత్వం వెలుసుబాటు ఇచ్చిందని ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. కె.గంగవరం మండలంలో గల సర్వేయర్లకు ఆయన శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. గతంలో విభజనకు రూ.500 ఫీజు వసూలు చేసేవారని, అయితే ఈ నెల 30 వరకు ఫీజు లేకుండా ప్రభుత్వం వెలుసుబాటు కల్పించిందని ఇది గ్రామాల్లో జాయింట్ భూములు గల రైతులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సర్వేఅధికారిఎన్.శ్రీనివాసు, డిటి మురళీకృష్ణ, సర్వేయర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా అధికారులు

ఏటిగట్టు పటిష్టతకు చర్యలేవి?

- అవస్థలలో లంక రైతులు
- పట్టించుకోని హెడ్ వర్క్స్ అధికారులు

ప్రజాశక్తి - ఆలమూరు

ఏటిగట్టు పటిష్టతకు చర్యలు ప్రభుత్వం చేపట్టకపోవడంతో రైతులు, లంక గ్రామాల రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు దశాబ్దాల క్రితం అప్పటి ప్రభుత్వ హయాంలో గౌతమి గోదావరి కుడి, ఎడమ ఏటిగట్టు కరకట్టల నిర్మాణాలు చేపట్టి నిధులు స్వాహా చేసి, పనులు మమ అనిపించారు. అప్పటి నుంచి గట్టుకు రక్షణ చర్యలు లేకపోవడంతో పాటుగా భారీ వాహనాల రద్దీ అంతకంతకు పెరుగుతూ వస్తోంది. దీంతో ఏటుగట్టు శిథిలమై పలుచోట్ల కుంగిపోతూ, పెద్ద గోతులతో వర్షాలకు కోతకు గురై చినుకు పడితే చిత్తడిగా మారిపోతుంది. దీంతో రైతులు పండిన పంటలను తరలించలేక నానా అవస్థలు పడుతున్నారు. దీనికి చర్యలు తీసుకోవలసిన హెడ్ వర్క్స్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. 1986, 1998 లలో గోదావరి నదికి భారీ వరదలు సంభవించి ఏటిగట్లకు వివిధ చోట్ల గండ్లు పడ్డాయి. దీంతో ప్రజల నుంచి ప్రభుత్వం మీద భారీ ఎత్తున విమర్శలు వెల్లువెత్తడంతో ఎట్టకేలకు 2007లో అప్పటి ప్రభుత్వం రూ.600 కోట్లు ఏటిగట్ల పటిష్టతకు నిధులు మంజూరు చేసింది. అప్పుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గౌతమి నదికి ధవళేశ్వరం నుంచి యానాం వరకు, బొబ్బర్లంక నుంచి పల్లంకుర్రు వరకు ఉన్న సుమారు 80 కిలోమీటర్ల చొప్పున ఎడమ, కుడిగట్టులు విస్తరించి ఉన్నాయి. అలాగే వాటికి శాఖ అధికారుల పర్యవేక్షణలో ఇచ్చిన అంచనాల మేరకు వెడల్పు చేయడంతో పాటుగా ఎత్తు పెంచేందుకు నిర్మాణ పనులు చేపట్టారు. ఇక్కడ పర్యవేక్షణ లోపంతో మొదటి దశ మట్టి పనుల నిర్మాణంతోనే అవకతవకల నేపథ్యంలో డబ్ల్యుబిఎం రోడ్డు వేయకుండా 2014 తెలుగు రాష్ట్రాల విభజన వరకు అరకొర పనులతో మమ అనిపించారు. దీనిపై భారీ విమర్శలు నేపథ్యంలో అప్పటి పర్యవేక్షణ అధికారులను ప్రభుత్వం సస్పెన్షన్ చేసి చేతులు దులుపుకుంది. మనకు స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి జాతీయ రహదారి వెంబడి ఉన్న వేమగిరి నుంచి జొన్నాడ సుమారు 20 కిలోమీటర్ల మేర ఎడమ గట్టు పటిష్టమైన ఆధునికీకరణకు నోచుకోలేదు. ఇప్పుడు దీని దుస్థితి మరీ దుర్భరంగా ఉంది. దీనికి పరిపూర్ణమైన నిధులు మంజూరు చేసి పటిష్టమైన తారు రోడ్డు నిర్మించి ఉంటే ఇలా ఉండేదికాదని పలు విమర్శలు ఉన్నాయి. పోనీ మిగిలిన భాగంలో 60 కిలోమీటర్లు మేర జొన్నాడ, యానాం వరకు తారు రోడ్డు నిర్మాణం జరిగి 8 ఏళ్ల కావస్తున్నా సరైన మరమ్మతులు చేపట్టనందున భారీ గుంతలుగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. అలాగే కొందరు రైతులు తమ స్వార్థం కోసం వారి సొంత భూముల్లోకి వెళ్లడానికి ఏటుగట్టును తొలిచి ప్రత్యేక మార్గాలు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆయా ప్రదేశాలలో ఏటిగట్టు బలహీనపడి ప్రమాదానికి సంకేతంగా మారింది. ఏటిగట్టు పొడవునా ఉండే ఈ సమస్యకు కారణం అధికారుల పర్యవేక్షణ లోపమే అని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. మండలంలోని జొన్నాడ నుంచి ధవళేశ్వరం వరకు ఉన్న ఏటిగట్టు రోడ్డు ఆలమూరు, కడియం మండల గ్రామాల రైతులతో పాటుగా నది పరివాహక ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరమైనదిగా ఉంది. అలాంటి ఈ మార్గాన్ని ప్రభుత్వ యంత్రాంగం విస్మరించడంతో భారీగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వెంటనే ఏటుగట్టుతో పాటుగా మార్గాన్ని ఆధునికీకరణలో భాగంగా పటిష్ట పరిచేందుకు పరిపూర్ణమైన నిధులు మంజూరుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని లంక గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు


మడికి వద్ద ఏటిగట్టు దుస్థితి(ఇన్‌సెట్)లో జొన్నాడ వద్ద చిత్తడిగా ఏటిగట్టు

తారు రోడ్డు నిర్మాణం వెంటనే జరగాలి



జొన్నాడ, ధవళేశ్వరం ఏటిగట్టుకు వెంటనే తారు రోడ్డు నిర్మించి రైతులను ఆదుకోవాలి. రైతులకు బాసటగా నిలిచేందుకు అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ఇలాంటి ముఖ్యమైన మార్గాలను పటిష్ట పరచాలని కోరుతున్నా. రైతులు ఇబ్బందులు పరిష్కరించాలి.

- అనుకుల సుదర్శన రావు, లంక రైతు, చొప్పెల్ల, ఆలమూరు మండలం

ఏటిగట్టు పటిష్టతకు చర్యలు తీసుకోవాలి



ఏటుగట్టుపై పటిష్టమైన రహదారిని నిర్మించేందుకు నూతన ప్రభుత్వం లోనైనా పటిష్టమైన చర్యలు చేపట్టాలి దీంతో లంక ప్రజల అవస్థలు తీర్చినట్లు అవుతుంది. ఈ విషయమై ఇప్పటికే స్థానిక ఎంఎల్ఏ బండారు సత్యానందరావు దృష్టికి తీసుకుని వెళ్లాము. దీనిపై ఎంఎల్ఏ సానుకూలంగా స్పందించారు.

-దూలం రాంబాబు, బి.వి.లంక

ఏటిగట్టు పటిష్టతకు అనుమతులు రాలేదు



జొన్నాడ, ధవళేశ్వరం వరకు 20 కి.మీ ఏటిగట్టు పటిష్టతకు ఎటువంటి అనుమతులు రాలేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాం. గట్టు ఆధునికీకరణకు అనుమతులు వచ్చిన వెంటనే ఎస్టిమేట్ పనులు చేపడతాం. ఈ మార్గంలో వివిధ ప్రాంతాలకు చెందినలకు, గ్రామాలకు కావాల్సిన సరుకు రవాణా జరుగుతున్నట్లు గుర్తించాము.

- ఆర్.విశ్వనాథరాజు, హెడ్ వర్క్స్ ఎఇ, ఆలమూరు మండలం

ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

ప్రకృతి సేద్యంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయాధికారి బోసు బాబు పేర్కొన్నారు ఈదరాడలో శుక్రవారం ప్రకతి వ్యవసాయ క్షేత్రాలను,పండించిన ఉత్పత్తులను పరిశీలించారు తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించే అవకాశం ఉండటంతో, ప్రకృతి సేద్యం గణనీయంగా పెరిగిందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులకు మార్కెట్లో ఎక్కువ డిమాండ్ ఉండటమే, కాకుండా వాటి వినియోగం ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయన్నారు రసాయన ఎరువులు వాడకం లేకుండా సహజ సిద్ధముగా లభ్యమయ్యే ఎరువులు పురుగుమందులు తయారు చేసి వాటితోనే సాగు చేస్తున్నారన్నారు. ప్రకృతి సేద్యముకు ప్రభుత్వము ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఆయన వెంట ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న కుడిపూడి జానకి, చెల్లుబోయిన రాధ, రైతులు గోగి లెనిన్ బాబు తదితరులు పాల్గొన్నారు.


సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసు బాబు

వాడివేడిగా మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. గ్రామాల్లోని పలు సమస్యలపై పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీశారు. ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు పాల్గొన్న సమావేశంలో తాతపూడి, నేలటూరు గ్రామాల్లో గతంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడం పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నేటికీ ఆ పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడం కారణం ఏంటని ఆ గ్రామ కార్యదర్శులను నిలదీశారు . 21 నెలలుగా ఎంపిటిసి సభ్యులకు గౌరవ వేతనం విడుదల చేయకపోవడంపై వారు ప్లకార్డులతో నిరసన వ్యక్తంచేసి వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో సమస్యలు, పథకాలుఅమలు, తదితర సమస్యలపై అధికారులచే సమాధానం చెప్పించవలసిన బాధ్యత ఎంపిడిఒపై ఉందని ఎంఎల్‌సి తోట అన్నారు. గ్రామంలో దోమల నివారణ కోసం మందులు, బ్లీచింగ్, శానిటేషన్, సంబంధించి ఇప్పటికీ నిధులు రాకపోవడానికి కారణమేమిటని దీనిపై ఎవరి సమాధానం చెప్పాలని వల్లూరు గ్రామ సర్పంచ్ దాసిమీనాకుమారి అధికారులను ప్రశ్నించారు. పాఠశాలల్లో విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేసినప్పుడు ప్రజా ప్రతినిధులకు చెప్పకుండా చేయడంపై ఎంఇఒ తాతారావును ఎంపిపి సత్యవేణి, పలువురు ఎంపిటిసి సభ్యులు సర్పంచులు, ప్రశ్నించారు. కేదార్లంకలో స్కూలును తీసుకువెళ్లి 4,5 కిలోమీటర్లు దూరంలో ఉన్న కొత్తపేటలో పెట్టడం ఎంటని ఎంఎల్‌సి తోట ఎంఇఒని ప్రశ్నించారు. ఆ స్కూలు కేదార్లంకలోనేఉండాలని డిమాండ్ చేశారు. నిడసనమెట్టలో చెరువు గట్టుపై ఉన్న కొబ్బరిచెట్లకు బహిరంగ వేలం జరగకుండా అడ్డుపడుతున్నారని జడ్‌పిటిసి సభ్యులు పుట్టపూడి అబ్బు ఆరోపించారు. దీనిపై అధికారులు స్పందించకపోతే కోర్టును ఆశ్రయించ నున్నట్లుతెలిపారు. తొలిత విమాన ప్రమాదంలోని మృతులకు నివాళులర్పించారు. అలాగే నేలటూరు ఎంపిటిసి సభ్యుని మృతి పట్ల మౌనం పాటించారు. అనంతరం ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్ శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యుడు అబ్బు, వైస్ ఎంపిపి సాకా శ్రీనివాస్, ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్, డిటి జానకి రామ్, వివిధ గ్రామాల ఎంపిటిసి సభ్యులు సర్పంచులు, అధికారులు, పాల్గొన్నారు.


పెండింగ్ బిల్లు చెల్లించకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న ఎంఎల్‌సి తోట

28వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - మండపేట

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె శుక్రవారం 28వ రోజుకు చేరింది.మండపేట పురపాలక సంఘం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరం నుండి కలువపువ్వు సెంటర్, మార్కెట్ రోడ్డు లో బిక్షాటన చేస్తూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం జీతాలు పెంచి తమను ఆదుకోవాలన్నారు. కార్మికులకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని, ఏళ్ల తరబడి ఎన్నో సమస్యలతో సతమవుతున్న తమను ప్రభుత్వం గుర్తించి న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కప్పల అన్నవరం,పిట్టా ప్రవీణ్ కుమార్,సైనం భాస్కరరావు, మందపాటి గన్నియ్య, వెంకటేశ్వర్లు, తలాటి వెంకన్న, వాసంశెట్టి బాలరాజు,టెకి వెంకన్న,కప్పల సురేంద్ర, గంటి నవీన కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మండపేటలో బిక్షాటన చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

ఆధునికీకరణకు నోచుకోని కాలువలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మధ్య డెల్టా పరిధిలో గల ఆత్రేయపురం రేవు నుంచి వాడపల్లి వరకు ఉన్న సైడ్ ఛానల్‌లో తుప్పలు, పచ్చగడ్డి, తూడు దట్టంగా అల్లేయడంతో సాగునీరు ముందుకు సాగడం లేదు. దీంతో పంట పొలాలకు నీరందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువలు నిలుపుదల చేసి 50 రోజులు కావస్తున్నా నేటికీ కాలువలు ఆధునికీకరణకు నోచుకోలేదు. రైతులు ఇప్పటికే ఆకుమడులు వేసేందుకు సన్నద్ధం అయ్యారు. కాలువ నీరు అందక బోరు బావుల ద్వారా ఆకులు మడులకు నీరు పెట్టుకుంటు న్నారు . ఈ పంటకల ద్వారా సుమారు 15 వందల ఎకరాలకు సాగునీరు అందవలసి ఉంది.


తుప్పలు తూటితో పూడుకుపోయిన సైడ్ ఛానల్

యోగాంధ్రను విజయవంతం చేయాలని పిలుపు

ప్రజాశక్తి - మండపేట

నేడు శనివారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎచ్చెర్ల నియోజకవర్గంలో జరిగిన యోగాంధ్ర 2025 సన్నాహక సమావేశంలో ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిష్టాత్మకమైన యోగాంధ్రను సమష్టి కృషితో విజయవంతం చేయాలని ఆయన అన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి సుమారు 7500 మంది ఈకార్యక్రమంలో పాల్గొంటారని, వారంతా రావటానికి 188 బస్సులు ఏర్పాటు చేసినట్లు ఎంఎల్ఏ వేగుళ్ల తెలిపారు. కార్యక్రమ లో ఎచ్చెర్ల ఎంఎల్ఎ నడుకుడిటి ఈశ్వరరావు, బిసి సంక్షేమ శాఖా మాత్యులు ఎస్.సవిత, పార్లమెంట్ సభ్యులు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మెర్ల పాలెం శివారు వాసంశెట్టి వారి పాలెం మండల ప్రజా పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన వాసంశెట్టి సత్యనారాయణ రూ.5 వేల విలువ చేసి నోట్ బుక్స్ ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గూడపాటి మాణిక్యాలరావు సహ ఉపాధ్యాయులు ఎస్‌విఎస్.రవికుమార్, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్, కేత వెంకటేశ్వరరావు అభినందించారు.


వాసంశెట్టివారిపాలెంలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న సత్యనారాణయ

కార్టూ'నిజం'



రుతుపవనాల కదలికలో ఆలస్యం

యువత పోరు విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి - అయినవిల్లి

వైసిపి తలపెట్టిన యువతపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్.జగన్ ఆదేశాల మేరకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ యువత పోరు పేరుతో యువజన విభాగం ఆధ్వర్యంలో జూన్ 23న ఉదయం 9 గంటలకు అమలాపురంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి, వినతిపత్రం అందజేస్తారు. కార్యక్రమంలో భాగంగా అయినవిల్లిలో వైసిపి కోఆర్డినేటర్ స్వగృహం నందు నియోజకవర్గ యూత్ కన్వీనర్, నాలుగు మండలలా యూత్ అధ్యక్షులు, జిల్లా విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు, నాలుగు మండలలా విద్యార్థి విభాగం అధ్యక్షులుతో సమీక్ష శుక్రవారం సమావేశం నిర్వహించారు. యువజన విభాగం, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో భారీ ఎత్తున యువత పాల్గొనాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గన్నవరపు శ్రీనివాసరావు

64వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - మండపేట

మండలం కేశవరం గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో వల్లూరు శ్రీవాణి చేస్తున్న రిలే నిరాహార దీక్ష శుక్రవారం 64 వరోజుకు చేరింది . ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ తొమ్మిది వేల జనాభా ఉన్న ఊరులో హైస్కూల్ కాంపౌండ్ ప్రహరీ నిర్మించాలని కోరుతున్నప్పటికీ ఏ ఒక్కరూ కూడా స్పందించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. హై స్కూల్ స్థలంలో ఆక్రమ కట్టడాలను తొలగించి ప్రహరీ నిర్మించే వరకు నా దీక్ష విరమించేది లేదని శ్రీవాణి తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హైస్కూల్ సమస్యను పరిష్కరించాలని కోరారు.

యథేచ్ఛగా ఇసుక తరలింపు

- అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్న స్థానికులు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

గోదావరిలో ఇసుక మాఫియా అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని కమిని పంచాయతీ పరిధిలోని త్రివేణి సంగమం వద్ద గత కొద్ది రోజులుగా ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడుతూ యథేచ్ఛగా తరలిస్తుండటం పై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల ఇదే ప్రాంతంలో ఈతకు దిగి 8 మంది విద్యార్థులు దుర్మరణం చెందిన ఘటన జరిగిన ప్రాంతానికి కూతవేటు దూరంలో మళ్ళీ ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టడం పలువురు బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అక్రవ తవ్వకాలతో నదీ కోతకు గురవుతుందని. దీని ప్రభావంతో సారవంతమైన భూములు నదీ గర్భంలో కలిసిపోతున్నాయని వాపోతున్నారు. కలెక్టర్ ఆదేశాలను సైతం గాలికొదిలేసి ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి నదీ గర్భం నుంచి పడవలతో అక్రమంగా ఇసుకను తవ్వడమే కాకుండా, యథేచ్ఛగా ట్రాక్టర్ల ద్వారా రాత్రిపగలు అనే తేడా లేకుండా ట్రాక్టర్లుతో ఇసుకను రవాణా చేస్తు పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని అక్రమ ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.


గోదావరిలో పడవల పై ఇసుక అక్రమంగా తరలింపు

పలువురికి పురస్కారాల అందజేత


ఉప్పలగుప్తం తహశీల్దార్ దివాకర్‌కు సేవా పురస్కారం

ప్రజాశక్తి - యంత్రాంగం

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో పలువురు అధికారులు పురస్కారాలు అందుకున్నారు.

ఉప్పలగుప్తం: ఉత్తమ సేవలు అందించినందుకు గాను స్థానిక తహశీల్దార్ వివిఎస్.దివాకర్ కు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. రెవెన్యూ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన రెవెన్యూ దినోత్సవ వేడుకల్లో తహశీల్దార్ దివాకర్‌కు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ టి. నిషాంతిఉత్తమ సేవా పురస్కారం అందజేసి అభినందించారు.అలాగే ఉత్తమ సేవలు అందించిన విఆర్ఒ,జె. మమత,విఆర్ఎ,పి.ఫణి కుమార్ లకు కూడా కలెక్టర్ మహేష్ కుమార్, జెసి,నిషాంతి లు ఉత్తమ సేవా పురస్కారాలను అందించారు.

ఆలమూరు: స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహశీల్దార్ సుబ్బరాజుకు జిల్లా ఉత్తమ సేవ అవార్డు వరించింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ మహేష్ కుమార్, జెసి నిషాంతి చేతుల మీదుగా డిటి అవార్డు అందుకున్నారు. అలాగే నవాబుపేట విఆర్ఒగా సేవలు అందిస్తున్న జి.రామకృష్ణ జిల్లా ఉత్తమ సేవ అవార్డుకు ఎంపిక కాగా ఆయన అందుకున్నారు. దీంతో వారు ఇరువురిని తహశీల్దార్ ప్రకాష్ బాబు, ఎంపిడిఒ ఎ.రాజు, ఆలమూరు డిసి అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావు, తదితరులు అభినందనలు తెలియజేశారు.


అవార్డు అందుకుంటున్న ఆలమూరు డిటి సుబ్బరాజు

ఘనంగా రెవెన్యూ దినోత్సవం


ఆలమూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డేను తహశీల్దార్ కె.జె.ప్రకాష్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ, ఎంపిడిఒ ఎ.రాజు మాట్లాడుతూ శాఖల్లో అతి ముఖ్యమైనది రెవెన్యూ శాఖ అన్నారు. దీని పరిధిలోని మిగిలిన అన్ని శాఖలు మిళితమై ఉంటాయని ఆయన వివరించారు. అలాగే తహశీల్దార్ ప్రకాష్ బాబు మాట్లాడుతూ థామస్ మనో అనే ఆంగ్లేయుడు వారి పాలనలో మన దేశంలో మొట్ట మొదటగా ఈ రెవెన్యూ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అప్పటినుంచి ఈ వ్యవస్థ ప్రభుత్వానికి రైతులకు వారధిగా పనిచేస్తూ వస్తుందన్నారు. అలాగే పలువురు వక్తలు రెవెన్యూ వ్యవస్థపై మాట్లాడారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన పలువురు రెవెన్యూ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భూ సర్వే డీటీ మంగారావు, మండల సర్వేయర్ ప్రభావతి, ఆర్ఐ రామాయమ్మ, బి గుమస్తా సుబ్రహ్మణ్యం, విఆర్ఒలు, రైతులు పాల్గొన్నారు.


ఆలమూరులో రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులకు సత్కారం

మండల టిడిపి అధ్యక్షునిగా బోనం బాబు

ప్రజాశక్తి - మామిడికుదురు

మామిడికుదురు మండల టిడిపి అధ్యక్షునిగా లూటుకుర్రు కి చెందిన బొనం సత్య నాగేశ్వరరావు (బాబు) ఎన్నికయ్యారు. పార్టీ ఆవిర్భావం నుంచి క్రమశిక్షణ గల కార్యకర్తగా కొనసాగుతూ, గత టిడిపి హయాంలో లూటుకుర్రు సర్పంచ్ గా, మామిడికుదురు జడ్పిటిసిగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు 2015లో బాల బాలాజీ దేవస్థానం ధర్మకర్తగా, తదుపరి రాష్ట్ర వాణిజ్య విభాగం టిడిపి ప్రధాన కార్యదర్శిగా కొనసాగారు పార్టీ సంస్థాగ్రత ఎన్నికల్లో భాగముగా మామిడి కుదురు ఎస్ సి కమ్యూనిటీ హాలు నందు శుక్రవారం మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, పి.గన్నవరం నియోజకవర్గ అబ్జర్వర్ మహమ్మద్ షరీఫ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ఎన్నికలు నిర్వహించారు మండలంలో 36 ఓట్లు ఉండగా బోనం బాబుకి 20 ఓట్లు రాగా ప్రత్యర్థి కొమ్ముల నందు బాబుకి 15 ఓట్లు పోలయ్యాయి. ఐదు ఓట్లు మెజార్టీతో బోనం బాబు మండల టిడిపి అధ్యక్షుడిగా విజయం సాధించారని షరీఫ్ ప్రకటించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపికి కార్యకర్తలే మూల స్తంభాలన్నారు ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా పార్టీని విడిచిపెట్టకుండా పార్టీతోనే ప్రయాణం చేసిన వారిని గుర్తించడం ఈ ఎన్నిక నిదర్శనం అన్నారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో కన్వీనర్లు డివి.సత్యనారాయణ, నామన రాంబాబు, బాల బాలాజీ దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మన్ మొల్లేటి శ్రీనివాస్, అంబాజీపేట మాజీ జడ్‌పిటిసి సభ్యుడు బొంతు పెదబాబు, 18 గ్రామాల గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు


బోనం బాబు

రైతు సంక్షేమానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

రైతు సంక్షేమ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని కూళ్ల డిసి ఛైర్మన్ మేక శివప్రసాద్ అన్నారు. శుక్రవారం టేకి గ్రామంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందన్నారు. పలు అంశాలపై రైతులతో చర్చలు జరిపారు. టేకి డ్రెయిన్‌లో పేరుకుపోయిన తూటి కాడ తొలగింపు పనులను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలమూరు డిసి మెల్లగోపాలం, రామచంద్రాపురం డిసి నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డి వైస్ డిసిలు, అంగర, మాచర, చింతలూరు నీటి సంఘం అధ్యక్షులు, మాజీ డిసి ఛైర్మన్లు, డ్రెయినేజీ డి ఇ పోచరావు,అధికారులు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శివప్రసాద్

అన్ని రంగాలలో కీలకమైనది రెవెన్యూ శాఖ

ప్రజాశక్తి - అమలాపురం

ప్రభుత్వ శాఖలన్నింటి లోకి రెవెన్యూ శాఖ కీలకమైందన,ఇ రెవెన్యూ శాఖకు 45 రకాల ప్రభుత్వ శాఖలతో నిత్యం అను బంధం ఉంటుందని, రాను రాను రెవెన్యూ శాఖకు విశిష్టత పెరుగుతోందని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. శుక్రవారం రెండవ రెవెన్యూ డే దినోత్సవ వేడుకలు స్థానిక కలెక్టరేట్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందు 1786 జూన్ 20న రెవెన్యూ బోర్డు ఏర్పాటు చేశారని 238 ఏళ్ల తర్వాత ఎపిలో రెవెన్యూ డే ఏర్పాటు చేయడం జరి గిందన్నారు. ప్రతి ఏటా జూన్ 20న రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించాలని ఎపి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు రెవెన్యూ డే ను మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రెవెన్యూ పరిధిలో ఉత్సవాలు మాదిరిగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలు, భూ వ్యవహారాలు, వివిధ ప్రయోజనాల కోసం అందించే ధ్రువీక రణ పత్రాలు, నీటి పన్నుతో సహా పలు అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడం జరిగిందన్నారు.1786 జూన్ 20న రెవెన్యూ బోర్డు ఏర్పాటు చేశారని బోర్డు రెవెన్యూ శాఖగా రూపాంతరం చెందిందన్నారు రెవెన్యూశాఖలో ఉత్తమ సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగు లను ఆ రోజున సన్మానించుకోవడం జరుగుతుంది రెవెన్యూ రికార్డులు, అడంగల్, 1-బి ప్రభుత్వ, దేవాదా యశాఖ, వక్స్ భూముల వివరాలు డిస్ప్లే చేయ డంతోపాటు సంబంధిత విషయాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించారన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ విశిష్ట సేవలందించిన 44 మంది ఉద్యోగులకు, కమాండేషన్ ధృవపత్రాలు మెమెంటోలు బహుకరించారు. 18 మంది ఉద్యోగ విరమణ చేసిన రెవెన్యూ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. జెసి టి.నిషాంతి మాట్లాడుతూ రెవెన్యూ క్రీడలు తో ప్రోత్సహిం చడం, రెవెన్యూ కేర్ పేరిట ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమం ప్రజాస్వామ్యంలో రెవిన్యూ శాఖ అత్యంత కీలకమై నదని ప్రతీ రెవెన్యూ ఉద్యోగి రోజురోజుకు విజ్ఞానాన్ని పెంపొం దించుకొని ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలన్నారు సమాజంలో ఏ సంక్షోభం ఎదురైనా తొలుత రెవెన్యూ శాఖ స్పందించి సమస్యను పరిష్కరించేందుకు సిద్ధం అవుతుందన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఎదగాలంటే కీలకమైనది రెవెన్యూశాఖని, అలాగే దేశంలో ఎన్నికలు నిర్వ హించాలంటే కీలక పాత్ర పోషించేది ఒక్క రెవెన్యూ శాఖే అన్నారు. సమాజం లో అన్ని రంగాలలో కీలకమైనది ఒక్క రెవె న్యూ శాఖ అన్నారు. బ్రిటీష్ పాలన కాలంలోనే రెవెన్యూ వ్యవస్థను ఏ ర్పాటు చేశారని గుర్తు చేశారు. బ్రిటీష్ కాలం నుంచి ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా రెవెన్యూశాఖ సేవలు ఎంతో కీలక మన్నారు. రెవెన్యూ దినోత్సవం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమన్నారు. బ్రిటీష్ పాలనకు ముందే మనదేశంలో రెవెన్యూ వ్యవస్థ ఉండేదని అన్నారు. ఆనాటి నుంచి నేటివరకు ప్రజాపరిపాల నలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకంగా పనిచేస్తోందని వివరించారు. డిఆర్ఓ రాజకుమారి మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగుల విధులు బాధ్యతలు గుర్తు చేసేందుకు రెవిన్యూ సేవల పట్ల ప్రజలకు అవగాహన కల్పించే దుకే రెవెన్యూ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు తెలి పారు.. భూ పరిపాలన చరిత్ర రాజ్యాల కాలం నాటిదని ఆ రోజుల్లో భూమి ఆదాయం ప్రధాన ఆదాయ వనరుగా ఉండి భూమి రికార్డులను తయారుచేసి నిర్వహించే వారన్నారు. ప్రస్తుత వ్యవస్థ మొఘలుల కాలం నుండి ఉద్భవిం చిందనీ బ్రిటిష్ పాలనలో దాని శాస్త్రీయ రూపాన్ని చేరుకుందన్నారు. బ్రిటిష్ పాలనలో రెవెన్యూ శాఖ పరిపాలనకు కేంద్రబిందువుగా ఉండేదన్నారు. పలువురు రెవెన్యూ ఉద్యోగులు ప్రసంగిస్తూ రెవెన్యూ ఉద్యోగులు ప్రజాభిముఖ పాలన, సత్వర స్పందన వంటి విలువలనుసరించి పని చేయాలన్నారు ప్రజ ల సహకారంతో ప్రజా హితార్థ సేవలు అందిం చాలని పరస్పర విశ్వాసం కలిగించేందుకు ప్రతి కార్యాచరణల్లో పారదర్శకతను పాటించడం, పూర్తి బాధ్యతాభావంతో ప్రజల సమస్యలకు వెంటనే పరిష్కార ప్రయత్నం చేయడం ముఖ్యమన్నారు. అదే సమయంలో పౌరులకు అందించాల్సిన సేవలను ముందస్తుగా, చురుకైన దృష్టితో, బాధ్యతాయు తంగా అందించదానికి ప్రణాళిక తో సమర్ధవం తంగా పనిచేయాలని కోరారు. ప్రభుత్వం రెవెన్యూ పై ఉంచిన నమ్మకాన్ని, గౌరవాన్ని మరింత పెంచే విధంగా ఉద్యోగులు సమగ్రంగా, ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని పనిచేయగలిగితేనే ఈ వేడుకలు సార్థకం అవుతాయన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌డిసి జి.మమ్మీ, ఎఒ కాశీ విశ్వేశ్వరరావు, రెవెన్యూ శాఖ జిల్లా ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, తహశీల్దార్లు,, వికాస జిల్లా మేనేజర్ రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ డే

రామచంద్రపురం: మండల రెవిన్యూ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డే నిర్వహించారు. తహశీల్దార్ బండి మృత్యుంజయరావు ఆధ్వర్యంలో, ప్రజాసేవలో- దశాబ్దాల రెవెన్యూ వ్యవస్థ, 'రెవిన్యూ డే 2025' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సేవలు ప్రజలందరికీ సంతప్తికరంగా ఉండాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలురువురు విఆర్ఓలకు బెస్ట్ పెర్ఫార్మ్ అవార్డ్ బహూకరించారు. అందులో భాగంగా హసన్ బాద గ్రామ విఆర్ఓ నరహరశెట్టి సత్తిబాబుకి బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డులు అందజేశారు. ఆయనకు హసన్ బాద గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు, వివిధ గ్రామాల విఆర్ఓలు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమానికి 25 గ్రామాల నుంచి విఆర్ఓలు హాజరయ్యారు.రెవెన్యూ దినోత్సవ సందర్భంగా కలెక్టర్వే మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఉత్తమ సేవలు అందించిన వారికి అవార్డులు ప్రదానం చేశారు. కె.గంగవరం మండలం పాణింగ పల్లెలో విఆర్ఒగా పనిచేస్తున్న వివి.సత్యనారాయణను అవార్డుకి ఎంపిక చేశారు. ఈ మేరకు కలెక్టర్ మహేష్‌కుమార్ చేతుల మీదగా విఆర్ఒ అవార్డు అందుకున్నారు. సత్యనారాయణను తహశీల్దార్ బండి మృత్యుంజయరావు, పానంగపల్లి గ్రామ సర్పంచ్ చీకట్ల సునీత అభినందించారు. ఉత్తమ సేవలు అందించిన 61 మంది రెవెన్యూ ఉద్యోగులకు కలెక్టర్ మహేష్ కుమార్, జెసి టి.నిషాంతి అవార్డులు అందజేశారు. **ముమ్మిడివరం:** రెవెన్యూ డే సందర్భంగా జిల్లా కలెక్టరేట్ లో శుక్రవారం జరిగిన రెవెన్యూ ఉద్యోగుల సదస్సులో జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని ముమ్మిడివరం తహశీల్దార్ యంవి.సుబ్బలక్ష్మి. అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు. **రావులపాలెం**: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం తహశీల్దార్ బి.ముక్తేశ్వరరావు అధ్యక్షతన రెవెన్యూ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రావులపాలెం తహశీల్దార్ ముక్తేశ్వరరావు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ చేతుల మీదుగా ఉత్తమ తహశీల్దార్ అవార్డు అందుకున్నారు. **మండపేట:** మండపేట రెటబన్యూ కార్యాలయంలో శుక్రవారం తహశీల్దార్ పి.తేజేశ్వరరావు అధ్యక్షతన రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరాలపై దాడి

ప్రజాశక్తి - ఆత్రేయపురం, కరప

మండల కేంద్రం ఆత్రేయపురం గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ ఎస్.రాము తన సిబ్బందితో శుక్రవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఐదుగురు వ్యక్తులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,330 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు నమోదు చేసినట్లు తెలిపారు.

కరప నడకుదురు శివారులో పేకాట శిబిరంపై శుక్రవారం ఎస్ఐ తోట సునీత సిబ్బందితో దాడి చేసి పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.8,220 నగదు సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కేసుల నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం, జగ్గంపేట

ఆత్రేయపురం రేవు సెంటర్ వద్ద వెహికల్ చెకింగ్ చేస్తుండగా ఇద్దరు మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా అధికంగా మద్యం తాగినట్లు నిర్ధారణ కావడంతో వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

తాగి వాహనాలు నడుపుతున్న 21 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు జగ్గంపేట సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. వారిని కోర్టులో హాజరు పరచగా 12 మందికి రూ.పది వేల చొప్పున జరిమానా విధించారని, ఏడుగురికి మూడు రోజుల జైలు శిక్ష, ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్టు తెలిపారు.

దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పాత కక్షల నేపథ్యంలో ఒక వ్యక్తిపై కొందరు వ్యక్తులు దాడి చేసిన కేసులో బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జ్ ఎస్ఐ ఎంవివి.రవీంద్రబాబు శుక్రవార తెలిపారు. వివరాల మేరకు నగర పంచాయతీ పరిధిలోని సోమి దేవరపాలెంకు చెందిన గుర్రాల సత్యనారాయణను అదే గ్రామానికి చెందిన పువ్వల శ్రీనివాసరావు, ఉందుర్తి ఏడుకొండలు, చుట్టుగుళ్ళ విజయ్, మట్టా సతీష్ దారి కాచి దాడి చేశారని సత్యనారాయణ ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేయగా, అలాగే అదే సంఘటనకు సంబంధించి పువ్వల శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్రాల సత్యనారాయణ అతని కుమారుడు లోవరాజులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి-నల్లజర్ల

తాడేపల్లిగూడెం మండలం ఆరుగొల్లు గ్రామానికి చెందిన తన కుమార్తె అదృశ్యమైందని తండ్రి రాజు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చదువు పూర్తవడంతో అమ్మమ్మ గ్రామమైన ఫంటా వారి గూడెంలో ఉంటుందని, ఈనెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో గాలించామని, అయినా ఆచూకీ దొరకలేదని తెలిపారు. దీంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

వివాహిత మృతిపై కేసు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వివాహిత మహిళ ఉరేసుకుని మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నిడదవోలు మండలం మునిపల్లి గ్రామానికి చెందిన సంధ్య, మండలంలోని మోర్త కు చెందిన నాగేశ్వరరావుతో 2020 లో వివాహమైంది, వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంధ్య, నాగేశ్వరావు మధ్య శుక్రవారం వివాదం చోటు చేసుకుంది. మనస్థాపానికి గురైన సంధ్య(22) భర్త ఇంట్లో లేని సమయంలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె తండ్రి కారింకి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎఎస్ఐ తెలిపారు.


ఆకుల రామకృష్ణతో సిఎం చంద్రబాబు

అనపర్తి నియోజకవర్గ టిడిపి పరిశీలకునిగా ఆకుల రామకృష్ణ

ప్రజాశక్తి - రావులపాలెం

అనపర్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకుడిగా రావులపాలెం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన ఆకుల రామకృష్ణ నియమితులయ్యారు. ప్రస్తుతం టిడిపి రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శిగా ఉన్న రామకృష్ణను అనపర్తి నియోజకవర్గానికి రెగ్యులర్ అబ్జర్వర్‌గా నియమిస్తూ పార్టీ అధిష్టానం శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు అప్పగించిన సిఎం నారా చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు అనపర్తి నియోజకవర్గంలో టిడిపిని బలోపేతం చేసేందుకు, కార్యకర్తల సమన్వయానికి నిబద్ధతతో పనిచేస్తానని చెప్పారు. పార్టీ విజయపథంలో ముందుకు సాగేందుకు ప్రతి కార్యకర్తతో కలిసి ముందుకు సాగేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు.

విద్యార్థులకు విద్యా కిట్ల పంపిణీ

ప్రజాశక్తి- సామర్లకోట

విద్యార్థుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని టిడిపి యువ నాయకులు చల్లా బుజ్జి అన్నారు. సామర్లకోట మండలం హుస్సేన్‌పురంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్లను చల్లా బుజ్జి అందచేశారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, పెద్దాపురం ఎంఎల్ఎఉ నిమ్మకాయల చినరాజప్పకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - అమలాపురం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా జెసి టి.నిషాంతి అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక కలెక్టరేట్‌లో పాత్రికేయు ల సమావేశం నిర్వహించి యోగా దినోత్సవ వేడు కల నిర్వహణను వివరించారు.

మానసిక ప్రశాంతత..

ఆలమూరు: యోగాతో మానసిక ప్రశాంత కలుగుతుందని ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతకుమారి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాలలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర డే పై ఎంపిడిఒ ఎ.రాజు అధ్యక్షతన అవగాహనా సదస్సు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

ఆత్రేయపురం: శనివారం జరిగే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి ఎంవి. రామారావు, ఎంపిడిఒ బికెఎస్ఎస్.వెంకట్ రామన్ అన్నారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో యోగాంధ్ర కార్యక్రమ పర్యవేక్షణ అధికారులతో వారిరువురు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు నిర్వహించారు. యోగాంధ్ర పర్యవేక్షణ అధికారులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** శనివారం ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు రామచంద్రాపురం మండలం లోని 25 గ్రామ పంచాయతీల 192 వేదికల యందు 'అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ పద్మజ్యోతి పిలుపునిచ్చారు. కె. గంగవరం మండలంలోనూ యోగా దినోత్సవం 25 గ్రామపంచాయతీల్లోనూ నిర్వహించేందుకు సూపర్వైజర్ ఏర్పాటు చేశామని అన్ని గ్రామాల్లోనూ యోగా దినోత్సవం నిర్వహించాలని కె.గంగవరం ఎంపిడిఒ ఎన్.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

వాడపల్లికి రావాలని స్పీకర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకోవాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ఆహ్వానించారు. శుక్రవారం స్పీకర్ స్వగృహంలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అయ్యన్నపాత్రుడికి అందజేశారు.

వెబ్ ల్యాండ్ జాయింట్ పట్టాదారు భూముల విభజనకు వెసులుబాటు

ప్రజాశక్తి - ఆలమూరు

భూముల రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో వెబ్ ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైనవారి భూముల విభజన జేయడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని శుక్రవారం మండల సర్వేయర్ ప్రభావతి తెలిపారు. రీ సర్వే పూర్తయిన వెబ్‌ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూ యజమానులకు భూ విభజన నిమిత్తం ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గతంలో రూ.500 నిర్దేశించిన రుసుమును మినహాయించినట్లు తెలిపారు. నామ మాత్రపు రుసుము రూ.50 గ్రామ సచివాలయంలో ఆన్లైన్లో చెల్లించి, ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. రుసుము మినహాయింపు ఈ నెలాఖరు వరకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకుని జాయింట్ పట్టాలను విడివిడిగా విభజన చేయించుకోవాలని కోరారు. దీని వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలైన అన్న దాత సుఖీభవ, తల్లికి వందనం వంటివి పొందవచ్చన్నారు.

ఎపిఇఎపిసెట్ ర్యాంకర్‌కు అభినందన

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని కొత్తూరు సెంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసించి ఇటీవల విడుదలైన ఫలితాల్లో 914 మార్కులతో పాటు, ఎపిఇఎపిసెట్‌లో 11,776 ర్యాంకు సాధించిన వాకా అమృతకు శుక్రవారం ప్రిన్సిపల్ నల్లమిల్లి సురేష్ రెడ్డి, ఆలమూరు ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ గుణ్ణం వీర్రాజు, జాయింట్ సెక్రటరీ గారపాటి త్రిమూర్తులు చేతుల మీదుగా కళాశాలలో ఘన సత్కారం నిర్వహించారు. దుశ్శాలువా కప్పి, బహుమతులు అందించి అభినందించారు. ప్రభుత్వ కళాశాలలో విద్యాభ్యాసం చేసి కార్పోరేట్ కళాశాలలతో సమానంగా ర్యాంకు సాధించడం అభినంద నీయమని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నైపుణ్యం కల్గిన అధ్యాపకులు అందుబాటులో ఉండటంతో పాటుగా, ఉచిత విద్య, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందుబాటులో ఉందని, చుట్టుపక్కల గ్రామాల తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ కళాశాలలో చేర్చి ఇక్కడ లభిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకోవాలని ప్రిన్సిపల్ సురేష్ రెడ్డి ఈ సందర్భంగా కోరారు.

22న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అంగర శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఈనెల 22న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం వీటికి సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. చిలుకూరి మాచరయ్య సత్యవతి, దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు కైలాసపతి పద్మావతి, దంపతుల నిర్వహణలో వీరి మనవలు కేపిటల్ హాస్పిటల్ కాకినాడ వైద్యుల తో ఆదివారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహిస్తారన్నారు. బిపి, షుగర్, థైరాయిడ్, గుండె సమస్యలు తదితర వ్యాధులకు సంబంధించి నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని అంగర, పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

మెప్మా సిబ్బందికి ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా సిబ్బందికి మున్సిపల్ కార్యాలయంలో ట్యాబ్ లు పంపిణీ చేశారు. మొత్తం 35 మందికి వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి మాట్లాడుతూ ట్యాబ్‌ల వల్ల మెప్మా సిబ్బంది పని వేగవంతం అవుతుంని అందరికీ ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కెవిఆర్.రాజు, మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం, కూటమి నాయకులు కంచు మర్తి బాబురావు, వి గౌరీశంకర్, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.


ట్యాబ్‌లు అందజేస్తున్న చైర్పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి

రైల్వేలైన్ పనులను పరిశీలించిన ఎంపీ

ప్రజాశక్తి - అమలాపురం

పి.గన్నవరం నియోజకవర్గం అయినవిల్లి మండలం శానిపల్లంక వద్ద కోనసీమ రైల్వే లైన్ కోసం జరిగిన పనులను ఎంపీ గంటి హరీష్, స్థానిక ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ తో కలిసి శుక్రవారం పరిశీలించారు. రైల్వే లైన్ లో భూములు ఉన్న రైతులతో సమావేశమయ్యారు.బాధిత రైతులకు న్యాయం చేసి రైల్వే లైన్ పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. రైల్వే లైన్ కోసం కోనసీమలో ఉన్న నదులలో దాదాపుగా పిల్లర్స్ పనులు పూర్తయ్యే దశలో ఉన్నాయని తెలిపారు. వీటిపై నిర్మించే సూపర్ స్ట్రక్షర్ నిర్మాణానికి రైల్వే శాఖ టెండర్ పిలిచిందని కాంట్రాక్టు అవార్డు కూడా ఖరారు అయ్యిందన్నారు. అనంతరం అమలాపురంలో ఎంపీ నివాసం వద్ద సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులతో హరీష్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సౌత్ సెంట్రల్ రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఎ.బద్దయ్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.అర్జున్‌రావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్రాక్షారామం ఆరోగ్య కేంద్ర వైద్యురాలిగా రత్న సుధ

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామం ఆరోగ్య కేంద్రానికి డాక్టర్ రత్న సుధ బదిలీపై వచ్చారు. ఈ మేరకు ఆమె శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. విధుల్లో చేరిన ఆమెకు ఈ సందర్భంగా పలువురు ఆరోగ్య కేంద్రం సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

రహదారిలో డ్రెయినేజీ గొయ్యి

తరుచూ ప్రమాదాలు

ప్రజాశక్తి - ఆలమూరు

జొన్నాడ మండపేట ఆర్అండ్‌బి రహదారిపై ఉన్న గోతులను మరమ్మతులు చేపట్టి పూర్తి చేశారు. అయితే ఈ క్రమంలో మండల కేంద్రంలోని మెయిన్ స్కూల్ ఎల్ టర్నింగ్ లో ఏర్పడిన డ్రెయినేజీ గొయ్యికి మరమ్మతులు చేపట్టకుండా విస్మరించారు. దీంతో నిత్యం పలు వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి. అలాగే టర్నింగ్ లో ఉన్న గొయ్యిని చూసుకోకుండా వాహన చక్రాలు అందులో ఇరుక్కు పోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు ఢీకొట్టిన ఘటనలు రాత్రులు ఎన్నో సంభవిస్తున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం టాటా ఎసి వ్యాన్ లోడుతో వెళుతూ ఆ గొయ్యిని తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో వాహనం పాక్షింగా దెబ్బతిని డ్రైవర్ మాత్రం ప్రమాదం నుంచి తప్పించు కున్నారు. ఇకనైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు వెంటనే చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ఈ గొయ్యే ప్రమాదానికి కారణం

రహదారిలో ఈ గొయ్యి కారణంగానే మా వాహనం ప్రమాదానికి గురైందని డ్రైవర్ ఆవేదన చెందారు. ఇకనైనా అధికారులు స్పందించి వేగంగా ఆ గొయ్యికి మరమ్మతులు చేపట్టాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.

కల్వర్టు విస్తరణ చేయాలి

మండల కేంద్రంలో డ్రెయినేజీ కల్వర్టు కు గొయ్యి పడిన మాట వాస్తవమేనని ఆర్అండ్‌బి ఎఇ వి.వెంకటరమణ తెలిపారు. గతంలో వేసిన డ్రైనేజీ శిథిలమై కల్వర్టు మరమ్మతులకు వచ్చింది. ఈ విషయాన్ని ఉన్నత అధికారులకు నివేదించాం. ప్రస్తుతం రహదారి మరమ్మతులకు టెండర్ల ప్రక్రియ జరుగుతోంది. పూర్తయిన వెంటనే రహదారితో పాటు డ్రెయినేజీ కల్వర్టుకు మరమ్మతులు చేపడతాం.


గొయ్యి చూపిస్తున్న బాధిత డ్రైవర్

సెంటర్ ఫర్ మైగ్రేషన్ కార్యాలయ పనితీరుపై సమీక్ష

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక్ల కలెక్టర్ వారి ఛాంబర్ నందు కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ కార్యాలయ పనితీరుపై అధికారులతో కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ ద్వారా ఇప్పటి వరకు వివిధ రకాలకు సంబంధించిన 68 కేసు లను పరిష్కరించినట్లు వెల్లడించారు. వీటిలో ఉద్యోగ సంబంధిత కేసులు 16, పాస్పోర్ట్ సంబంధిత కేసులు 3, విదేశాల లోపనుల నిర్వ హణకు సంబంధించి విదేశాలకు వెళ్లి ఇబ్బంది పడిన 7 మందిని తిరిగి స్థాని కంగా రప్పించామన్నారు. ఒకరు పనుల నిమిత్తం వెళ్లి విదేశాలలో చనిపోయారన్నారు. భారత రాయబార కార్యాలయం ద్వారా సంప్రదింపులు జరిపి ఆ యొక్క మృతదేహాన్ని స్థానికంగా తీసుకువచ్చి బంధువులకు అప్పగించామన్నారు. ఆర్థిక పరిస్థితుల కార ణంగా విదేశాలకు పనుల నిమిత్తం వెళ్లి ఇబ్బం దులు ఎదుర్కొంటున్న ఏడు మంది తిరిగి స్థానికంగా వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఒకరు అగ్ని ప్రమాదంలో చనిపోయారని అన్నారు. ఆ మృతదేహాన్ని గుర్తించేందుకు డిఎన్ఎ టెస్ట్ రిపోర్టును విదేశానికి పంపేందుకు చర్యలు కొనసాగు తున్నాయని తెలిపారు.ఈ కార్యక్ర మంలో నోడల్ అధికారి డిఆర్వో రాజకుమారి, కోఆర్డి నేటర్ జి రమేష్, సిబ్బంది సత్తిబాబు నాగేంద్ర, నాగ సుశీల, సఫియా తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ క్లాస్ రూమ్ ప్రారంభం

ప్రజాశక్తి -కరప

అరట్లకట్టలో ప్రైమరీ స్కూల్లో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ రూమ్, ఆటల పరికరాలను రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ శుక్రవారం ప్రారంభించారు. శుక్రవారం రూరల్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం అరట్లకట్టలో మోడల్ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో అరట్లకట్ట మోడల్ స్కూల్ ప్లేజోన్‌కు రూ.2 లక్షల విలువైన ప్లే ఎక్విప్మెంట్‌ను పాఠశాల ఉపాధ్యాయులు ఎన్.విశ్వేశ్వరరావు స్నేహితులైన అమెరికాకు చెందిన పొన్నపల్లి రమేష్ (మండపేట), ముత్యాల తారక రామారావు (తాపేశ్వరం) డిజిటల్ థియేటర్‌కు గ్రామానికి సంబంధించిన పెద్దలు ప్రత్తిపాటి ఆదిరాజు రూ.30,000, గంటా వీరన్న చౌదరి రూ.30,000 , రాయుడు ఈశ్వర్ రావు రూ.10,000 అందించారు. రూ.25 వేల విలువైన నోట్ పుస్తకాలను అందించారు. వీటిని ఎంఎల్ఎ నానాజీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు బికె.కృష్ణవేణి, పి.సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ గోపి సత్యవేణి, నక్కామల్లె పవన్, భోగిరెడ్డి కొండబాబు పాల్గొన్నారు.

ఆదిత్యలో ఎన్‌సిసి క్యాంప్ ముగింపు

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య యూనివర్సిటీలో ఈ నెల 11 నుంచి 20 వరకు నిర్వహించిన సిఎటిసి-7 ఎన్‌సిసి క్యాంపు విజయవంతంగా ముగిసిందని కమాండింగ్ ఆఫీసర్ గ్రూప్ కెప్టెన్ ప్రవీణ్ బాబు తెలిపారు. పది రోజుల పాటు నిర్వహించిన ఈ క్యాంపులో క్యాడెట్స్‌కు దేశ భద్రత, సైబర్ నేరాలపై అవగాహన, ఎన్‌డిఆ రేఫ్ బృందం ద్వారా విపత్తుల అవగా హన కార్యక్రమాలు నిర్వహించారన్నారు.